క్లుప్తంగా

పంటల బీమా ప్రీమియం రైతులే చెల్లించాలి



మాట్లాడుతున్న వ్యవసాయాధికారి నిరంజన్

కోవెలకుంట్ల: ఈ ఏడాది రబీ పంటలకు సంబంధించి బీమా ప్రీమియం రైతులే చెల్లించాలని మండల వ్యవసాయాధికారి నిరంజన్ తెలిపారు. శుక్రవారం అమడాల గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ ఏడాది రబీ సీజన్‌లో శనగ గ్రామ యూనిట్‌గా, వరి, జొన్న, మినుము పంటలు మండల యూనిట్‌గా, వేరుశనగ, ఉల్లి పంటలు జిల్లా యూనిట్‌గా పంటల బీమా నోటిఫై చేసినట్లు తెలిపారు. రైతులు బీమా ప్రీమియాన్ని బ్యాంకులు, కామన్ సర్వీస్ సెంటర్లు, గ్రామ సచివాలయాల్లో చెల్లించి రసీదులు పొందాలని సూచించారు. రబీ పంటలు సాగు చేసిన రైతులు ఈ-పంట నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు.

సస్యరక్షణపై అవగాహన



కటివానికుంటలో పొలం బడి కార్యక్రమం

బనగానపల్లె: రైతులు స్థానిక వ్యవసాయశాఖ సిబ్బంది సలహాలు తీసుకుని చీడపీడల నివారణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి సుబ్బారెడ్డి తెలిపారు. కటివానికుంటలో శుక్రవారం పొలం బడి కార్యక్రమం జరిగింది. ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగు చేసిన కంది,జొన్న,కొర్ర పంటల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా లలిత బాధ్యతలు

బనగానపల్లె రూరల్: బనగానపల్లె ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ లలిత శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ ఇన్‌చార్జ్‌గా కోవెలకుంట్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ బాబునాథ్ వ్యవహరించారు. రెగ్యులర్ ప్రిన్సిపాల్‌గా నంద్యాల డిగ్రీ కళాశాల గణిత అధ్యాపకురాలు లలిత పదోన్నతిపై ఇక్కడికి వచ్చారు. అధ్యాపకులు ఆమెకు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అధ్యాపకులు బాబునాథ్, సూర్యనారాయణరెడ్డి, మహమ్మద్‌గౌస్, సుధాకర్‌రెడ్డి, రామకృష్ణ, నీతమ్మ, కౌసల్యదేవి, వరలక్ష్మీపాల్గొన్నారు.

అదనపు కట్నం కోసం వేధింపులు

- నలుగురిపై కేసు నమోదు

కోవెలకుంట్ల: వివాహ సమయంలో కట్న కానుకలు అందజేసినా అదనపు కట్నం తేవాలని వేధింపులకు గురి చేయడంతో బాధిత మహిళ శుక్రవా రం రాత్రి పోలీసులను ఆశ్రయించింది. రేవనూరు ఎస్‌ఐ భూపాలుడు సమాచారం మేరకు.. కోవెలకుంట్ల మండలం కలుగొట్లకు చెందిన శిరీష అనే మహిళకు దొర్నిపాడుకు చెందిన వెంకట శివకుమార్‌తో ఈ ఏడాది ఏప్రిల్‌లో వివాహం జరిగింది. ఆ సమయంలో కట్నకానుకల రూపేనా రూ. 22.50 లక్షలు అందజేశారు. వివాహం జరిగి ఆరు నెలలు కాకముందే అదనపుకట్నం తేవాలని భర్త, అత్తమామలు, మరిది తిరుపాలమ్మ, వెంకటసుబ్బయ్య, సూర్యకుమార్ కొద్ది రోజుల నుంచి వేధింపులకు గురి చేస్తున్నారు. తాళలేక పుట్టింటికి చేరుకున్న బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో నలుగురిపై వరకట్న వేధింపుల కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

డోన్ టౌన్: పట్టణ సమీపంలోని ఉడుములపాడు దత్తాత్రేయ స్వామి ఆలయం వద్ద శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. వివరాలు.. మండలంలోని సోంపురం గ్రామానికి చెందిన మనోహర్, రహంతుల్లా వ్యక్తిగత పనుల నిమిత్తం డోన్‌కు బైక్‌పై వచ్చారు. తిరుగు ప్రయాణంలో రహంతుల్లా భార్య బావమ్మను బైక్‌పై ఎక్కించుకుని గ్రామానికి బయలుదేరారు. ఉడుములపాడు వద్ద రోడ్డు పక్కన ఆపివున్న బొలెరో వాహనం ఒక్కసారిగా రోడ్డుపైకి రావడంతో బైక్ ఢీకొంది. ఈ ప్రమాదంలో రహంతుల్లా, మనోహర్‌లకు తీవ్రగాయాలు కాగా చికిత్స నిమిత్తం కర్నూలుకు తరలించారు. బావమ్మకు స్వల్ప గాయాలయ్యాయి.

భూసమస్యల పరిష్కారానికి కృషి

అవుకు: గ్రామాల్లో నెలకొన్న భూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తహసీల్దార్ సువర్ణాదేవి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని మెట్టుపల్లెలో గ్రామసభ నిర్వహించారు. రీసర్వే జరిగిన గ్రామాల్లో భూ సమస్యలను పరిష్కరించడానికే గ్రామసభలు నిర్వహిస్తున్నామని.. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామంలో భూయజమానుల నుంచి 79 ఫిర్యాదులు అందాయని తెలిపారు. డీటీ మల్లికార్జున రెడ్డి, మండల సర్వేయర్ హరి, ఆర్‌ఐ వెంగల్‌రెడ్డి పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

బనగానపల్లె రూరల్: భూసమస్యల పరిష్కారానికి నిర్వహిస్తున్న గ్రామ సభలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ నారాయణరెడ్డి అన్నారు. చెరువుపల్లె గ్రామ సభలో మొత్తం 26 మంది రైతుల నుంచి దరఖాస్తులు అందాయన్నారు.

- అంగన్‌వాడీ కేంద్రాలకు అందని పుస్తకాలు
- గత ఏడాది పుస్తకాలతోనే చిన్నారులకు బోధన
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం

ప్రీస్కూల్.. నో బుక్స్



గత ప్రభుత్వం అందజేసిన ప్రీ ప్రైమరీ 1,2 బుక్స్



అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు

డోన్ రూరల్: అంగన్‌వాడీ చిన్నారులపై కూటమి ప్రభుత్వం చిన్న చూపు ప్రదర్శిస్తోంది. కేంద్రాలకు వచ్చే చిన్నారులకు బోధించే ప్రీస్కూల్‌పై శీతకన్ను వేసింది. విద్యా సంవత్సరం ఆరంభమై దాదాపు నాలుగు నెలలు గడుస్తున్నా పుస్తకాలు సరఫరా చేయలేదు. దీంతో అంగన్‌వాడీ కార్యకర్తలు పాత పుస్తకాలతోనే బోధించాల్సిన దుస్థితి నెలకొంది.

కొత్త పుస్తకాలు ఎప్పుడో..?

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో కేంద్రాలకు వచ్చే చిన్నారులకు సులభంగా అర్థమయ్యే రీతిలో పాఠాలు బోధించేందుకు ప్రత్యేక పుస్తకాలు అందజేశారు. నాలుగు సంవత్సరాలలోపు ప్రీస్కూల్ చిన్నారులకు పీపీ-1కిట్లు, ఐదుళ్లలోపు పిల్లలకు పాఠాలు బోధించేందుకు పీపీ-2 కిట్లు పంపిణీ చేశారు. కిట్లలో ఆంగ్లం, గణితం, డ్రాయింగ్, స్పోకెన్ ఇంగ్లిష్, యాక్టివిటీ పుస్తకాలుంటాయి. వాటితో పాటు బర్డ్స్-1 కిట్లు అందించారు. వీటి ద్వారా కథలు చెప్పడం, ఆట పాటలతో కూడిన విద్యను బోధించడం, సృజనాత్మకతను జోడించి వినూత్న పద్ధతుల్లో పిల్లలకు బోధించేవారు. అంతటి కీలకమైన ప్రీస్కూల్ పుస్తకాలను ఈ ఏడాది ఇప్పటి వరకు సరఫరా చేయలేదు. వాటినిపై కూటమి ప్రభుత్వం ఊసేత్తడం లేదు.

ప్రైవేటు వైపు తల్లిదండ్రుల చూపు

అంగన్‌వాడీ కేంద్రాల్లో బోధన ఆశించిన స్థాయిలో అందకపోవడం.. ప్రభుత్వం పుస్తకాలను కూడా సరఫరా చేయకపోవడంతో తల్లిదండ్రులు తమ పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపేందుకు ఆసక్తి చూపడంలేదు. తప్పనిసరి పరిస్థితుల్లో వేలకు వేలు వెచ్చించి ప్రైవేటు పాఠశాలల్లో నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీల్లో చేర్పిస్తున్నారు. దీంతో ప్రైవేటు, కార్పొరేట్ సెక్టార్‌ను ప్రోత్సహించేందుకే ఇలా ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలకు కొత్త పుస్తకాలను సరఫరా చేయడం లేదన్న ఆరోపణలు తల్లిదండ్రులు, ప్రజల నుంచి వినిపిస్తున్నాయి.

ఇదీ కేంద్రాలు, చిన్నారుల లెక్క

ప్రాజెక్టు	డోన్
మండలాలు	ప్యాపిలి, డోన్, బేతంచెర్ల
మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలు	248
మినీ అంగన్‌వాడీ కేంద్రాలు	3
ఒకటి నుంచి మూడేళ్ల చిన్నారులు	8,294
మూడు నుంచి ఐదేళ్ల చిన్నారులు	7,039
5-6 ఏళ్ల చిన్నారులు	778

కొత్త పుస్తకాలు రాలేదు



2024-25 సంవత్సరానికి సంబంధించి ఇంకా కొత్త పీపీ-1, పీపీ-2 పుస్తకాలు రాలేదు. ఎప్పు డు వస్తుందో తెలియదు. చిన్నారులకు ఇబ్బంది లేకుండా తగ ఏడాది పుస్తకాలతో అంగన్‌వాడీ కార్యకర్తలు బోధిస్తున్నారు. ఆటపాటలతో సృజనాత్మక పద్ధతిలో బోధన సాగుతోంది.

–షంషాద్‌బేగం, ఐసీడీఎస్ సీడీపీఓ, డోన్

రాష్ట్రస్థాయి కబడ్డీ జట్టుకు ఎంపిక



ఎంపికైన విద్యార్థితో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

బనగానపల్లె: రాష్ట్ర స్థాయి అండర్-14 కబడ్డీ జట్టుకు బనగానపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలకు 6వ తరగతి విద్యార్థి దిలీప్‌నాయక్ ఎంపికైనట్లు ఇన్‌చార్జ్ హెచ్‌ఎం డి.నాగరాజు తెలిపారు. ఇటీవల నంద్యాలలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో విద్యార్థి ప్రతిభ చాటినట్లు చెప్పారు. బాగా ఆడి పాఠశాలకు మంచి పేరు తీసుకునిరావాలని ఆకాంక్షించారు. విద్యార్థిని హెచ్‌ఎంతో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

కోలుకోలేక యువకుడి మృతి

ప్యాపిలి: డోన్ మండలం ఉంగరానిగుండ్ల గ్రామానికి చెందిన మధు (25) చికిత్స పొందుతూ కోలుకోలేక గురువారం రాత్రి మృతి చెందాడు. ఈ నెల 15వ తేదీ ప్యాపిలి మండలం ఏనుగుమర్రి గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో విష్ణు అనే యువకుడు అక్కడికక్కడే మృతి చెందగా తీవ్రంగా గాయపడిన మధును కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తరలించిన విషయం విధితమే. దాదాపు 10 రోజుల పాటు మృత్యువుతో పోరాడిన మధు కోలుకోలేక మృతి చెందాడు.

హద్దు మీరితే కఠిన చర్యలు



మాట్లాడుతున్న సీఐ రమేష్‌బాబు

కొలిమిగుండ్ల: నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ రమేష్‌బాబు హెచ్చరించారు. శుక్రవారం స్థానిక యూపీఎస్‌లో ఎస్‌ఐ వెంకటేశ్వర్లుతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో నాటుసారా, బెల్ట్‌షాపులు, పేకాట, మట్కా వంటి అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. రౌడీషీటర్లకు ప్రతి ఆదివారం కౌన్సిలింగ్ ఇస్తున్నామని తెలిపారు. కేసుల్లో తలదూర్చితే రౌడీషీటర్లకు జ్యుడిషియల్ రిమాండ్‌కు పంపుతామని హెచ్చరించారు. నిబంధనలకు విరుద్ధంగా గనుల్లో బ్లాస్టింగ్ చేయరాదన్నారు. కొలిమిగుండ్లలో ఇష్టారాజ్యంగా వాహనాలు పార్కింగ్ చేస్తుండడం వల్ల ప్రజలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని తమ దృష్టికి వచ్చిందని.. వాటిపై దృష్టి సారించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆర్టీసీ బస్టాండ్, తహసీల్దార్ కార్యాలయం వద్ద బస్సుల కోసం వేచి ఉండే సమయంలో విద్యార్థినులకు ఆకతాయిల నుంచి ఇబ్బందులు ఎదురుకాకుండా ఉండేందుకు సేఫ్టీ వెహికల్ ఏర్పాటు చేసి సిబ్బందితో గస్తీ చేయిస్తామన్నారు.

సాదాసీదాగా మండల సర్వసభ్య సమావేశం



ప్రగతి నివేదిక సమర్పిస్తున్న ఎంఈఓ వెంకటేశ్ నాయక్

ప్యాపిలి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా జరిగింది. వైస్ ఎంపీపీ సిద్ధపు నాగేశ్వరి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యుడు బోరెడ్డి శ్రీరామిరెడ్డి మాట్లాడుతూ.. గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు. మూడు నెలలకోసారి జరిగే సర్వసభ్య సమావేశానికి మండల స్థాయి అధికారులు గైర్హాజరు కావడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. సర్వసభ్య సమావేశానికి హాజరు కాకపోతే ప్రజల సమస్యలను అధికారులు ఎలా తెలుసుకుంటారని ప్రశ్నించారు. ఎంపీడీఓ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. సమావేశానికి గైర్హాజరైన అధికారులపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. తహసీల్దార్ భారతి రెవెన్యూ శాఖకు సంబంధించిన ప్రగతిని వివరించారు. అంతకు ముందు వివిధ శాఖల అధికారులు తమ శాఖలకు సంబంధించిన ప్రగతి నివేదికలు సమర్పించారు. ఈఓఆర్డీ బాలకృష్ణుడు, పీఆర్ ఏఈ ప్రభాకర్ రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మనోహర్, వైద్యాధికారిణి వాణిశ్రీ, ఉద్యానశాఖ అధికారిణి కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షాలతో పొగాకు రైతు కుదేలు



అధిక తేమతో రంగుమారిన పొగాకు పంట

కోవెలకుంట్ల: బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడన ప్రభావంతో స్థానిక వ్యవసాయ సబ్ డివిజన్‌లో వారం పాటు భారీ వర్షాలు కురిశాయి. గతేడాది పొగాకు అన్ని విధాలా కలిసి రావడంతో ఈ ఏడాది సబ్ డివిజన్‌లోని కోవెలకుంట్ల, సంజామల, అవుకు, కొలిమిగుండ్ల, ఉయ్యాలవాడ, దొర్నిపాడు మండలాల్లో ఈ ఏడాది ఖరీఫ్‌లో 673 ఎకరాలు, రబీ సీజన్‌లో 250 ఎకరాల్లో రైతులు పొగాకు పంట సాగు చేశారు. నారు, నాట్లు, రసాయన ఎరువులు, కలుపునివారణ, క్రిమి సంహారక మందు, తదితర పెట్టుబడుల రూపంలో ఎకరాకు రూ. 10 వేల వరకు వెచ్చించారు. అధిక వర్షాల కారణంగా పొలంలో నీరు నిలిచి ఆకులు రంగుమారి ఎండిపోతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి అధిక తేమ శాతం నుంచి పైరును కాపాడుకునే సస్యరక్షణ తెలియజేయాలని రైతులు కోరుతున్నారు.

కార్యాలయానికి తాళాలు వేడయం హేయమైన చర్య

డోన్ రూరల్/డోన్ టౌన్: మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి మున్సిపల్ కార్యాలయంలోని పార్కులో వాకింగ్‌కు వస్తున్నారని తెలిసి గేటుకు తాళాలు వేయడం హేయమైన చర్య అని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కె.రామాంజినేయులు, జిల్లా కార్యదర్శి ఎస్.రంగనాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ.. వీలైతే అభివృద్ధి పనులు చేసి చూపించాలే కానీ వ్యక్తిగతంగా టార్గెట్ చేసి ఇలా చిల్లర రాజకీయాలు చేయడం సరికాదన్నారు. అధికారం ఉందని ఇష్టం వచ్చినట్లు ప్రవర్తించడం మంచి పద్ధతి కాదని డీవైఎఫ్ఐ మండల కార్యదర్శి నక్కి శ్రీకాంత్ అన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటా



పార్టీ కార్యకర్తలు, నాయకులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి

ప్యాపిలి: వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు అన్ని వేళలా అండగా ఉంటానని మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని రామరత్నగిరిలో శుక్రవారం గ్రామాలవారీగా నాయకులు, కార్యకర్తలతో మాట్లాడారు. గ్రామాల్లో ప్రధానంగా ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందుల గురించి ఆరా తీశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గ్రామాల్లో పరిస్థితి ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ.. ఐదేళ్లుగా ఖరీఫ్ సీజన్‌లో అందుకున్న రైతు భరోసా ఈ ఏడాది అందలేదన్నారు. అలాగే గత ప్రభుత్వం అమలు చేసిన అమ్మ ఒడి పథకాన్ని ప్రస్తుత ప్రభుత్వం పేరు మార్చడమే తప్ప ఇంతవరకు అమలుచేయలేదని పలువురు కార్యకర్తలు వాపోయారు. అర్హత ఉన్నప్పటికీ పింఛన్ల ఏరివేత కార్యక్రమం జరుగుతోందని.. దీంతో వృద్ధులు, వితంతులు, దివ్యాంగులు తమ పింఛన్ ఉంటుందో.. పోతుందో అనే ఆందోళనలో ఉన్నారని కార్యకర్తలు మాజీ మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన బుగ్గన అర్హులకు అన్యాయం జరిగితే వైఎస్సార్‌సీపీ ప్రజల పక్షాన పోరాటం చేస్తుందన్నారు. ప్రభుత్వం తక్షణమే ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మీట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీరాములు, సర్పంచ్‌లు వెంకటేశ్వరమ్మ, దస్తగిరి, ఎంపీటీసీ జయరామయ్య, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పోతుదొడ్డి కృష్ణమూర్తి నాయకులు మెట్టు వెంకటేశ్వర్ రెడ్డి, బోరెడ్డి పుల్లారెడ్డి, బొర్రా మల్లికార్జునరెడ్డి, శ్యాంరెడ్డి, గడ్డం భువనేశ్వర్ రెడ్డి, శివనాగిరెడ్డి, కమతం భాస్కర్ రెడ్డి, బాలయ్య, వెంకటేశ్వర్ రెడ్డి, రజనీరెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, రసూల్, శ్రీనివాసులు, ప్రకాశ్ రెడ్డి, రఘునాథ్ రెడ్డి, సోమశేఖర్, జాకీర్, తులసీరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా చౌడేశ్వరిదేవి పల్లకీ సేవ



పల్లకీ సేవ నిర్వహిస్తున్న ఆలయ సిబ్బంది

బనగానపల్లె రూరల్: నందవరంలో వెలసిన చౌడేశ్వరిదేవికి శుక్రవారం పల్ల కీ సేవను కనుల పండువగా నిర్వహించారు. ఆల య అసిస్టెంట్ కమిషనర్ కామేశ్వరమ్మ, అర్చకుల ఆధ్వర్యంలో అమ్మవారికి కుంకుమార్చన, అభిషేకాలు, ప్రత్యేక అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాన్ని పల్లకీలో కొలువుంచి ఆలయ ప్రాకారంలో ఊరేగించారు.

వేడుకగా తిరుచ్చి ఉత్సవం

బేతంచెర్ల: ప్రముఖ వైష్ణవ ఆలయమైన మద్దిలేటి నరసింహస్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి స్వామి వారికి తిరుచ్చి ఉత్సవం నిర్వహించారు. మంగళవాయిద్యాలు, భక్తుల గోవిందనామస్మరణల నడుమ స్వామివారు ఆలయ మాడవీధుల్లో విహరించారు. ఆలయ ఈఓ రామాంజనేయులు, వేదపండితుడు కల్యాణ చక్రవర్తి, ఆలయ అర్చకులు మద్దిలేటిస్వామి, మనోహర్, నరసింహ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి.

పోస్టులు భర్తీ చేయాలి

డోన్ టౌన్: రాష్ట్రంలో ప్రత్యేక ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలని ఆ సంఘం జిల్లా ఇన్‌చార్జ్ కొండా లోకేష్‌రావు డిమాండ్ చేశారు. శ్రీరామనగర్‌లోని కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో 75 వేల మంది ప్రత్యేక అవసరాలగల పిల్లలు.. ప్రత్యేక ఉపాధ్యాయ కోర్సు చేసిన 15 వేల మంది అభ్యర్థులు ఉన్నారని పేర్కొన్నారు. కనీసం ఈ మెగా డీఎస్సీలో 3 వేల పోస్టులైన భర్తీ చేయాలని కోరారు.

పశుగణనకు రైతులు సహకరించాలి



కోవెలకుంట్ల: పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అధికారులు

కోవెలకుంట్ల: మండలంలో చేపట్టనున్న పశుగణ నకు ప్రజలు సహకరించాలని పశువైద్యాధికారి కృష్ణకుమార్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ప్రాంతీయ పశువైద్యశాలలో వాల్‌పోస్టర్లు విడుదల చేశారు. మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సతీమణి ఇందిరమ్మ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పశువైద్యాధికారి మాట్లాడుతూ.. వచ్చే ఏడాది ఫిబ్రవరి 28వ తేదీ వరకు పశుగణన జరుగుతుందని తెలిపారు. మండలంలోని 12,841 గృహాలను సందర్శించి పశువులు, ఆవులు, గేదెలు, గొర్రెలు,మేకలు, గుర్రాలు, ఒంటెలు, పందులు, కోళ్లు వంటి 16 జంతువుల వివరాలను సేకరిస్తారని పేర్కొన్నారు. పాడిరంగ పథకాల రూపకల్పన, టీకాలు, నట్టల నివారణ మందుల లభ్యతకు పశుగణన దోహదం చేస్తుందన్నారు.

పశుగణన ప్రక్రియ ప్రారంభం

కొలిమిగుండ్ల: మండలంలో జాతీయ పశుగణన ప్రక్రియను శుక్రవారం నుంచి ప్రారంభించినట్లు పశువైద్యాధికారిణి పద్మావతి తెలిపారు. వీటికి సంబందించిన పోస్టర్లను స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ప్రసాదరెడ్డితో కలిసి ఆవిష్కరించారు. మండలంలో గణన చేపట్టేందుకు 12 మంది ఎన్యుమరేటర్లను నియమించామని తెలిపారు. 2025 ఫిబ్రవరి 28 వరకు కొనసాగుతుందని చెప్పారు. పశువులు, పెంపుడు జంతువులు, గొర్రెలు, మేకలు, ఆవులు, ఎద్దులు, కోళ్లు ఎన్ని ఉన్నాయనే విషయాన్ని ఇంటింటికి వెళ్లి పక్కాగా వివరాలను సేకరించే ఏర్పాట్లు చేశామన్నారు. పశుగణన పక్కాగా జరిగేందుకు ప్రజలు సహకరించాలని కోరారు.

పశుగణన వాల్ పోస్టర్ల ఆవిష్కరణ

సంజామల: మండల పరిధిలోని ముదిగేడు గ్రామంలో పశుగణన వాల్ పోస్టర్లను వైస్ ఎంపీపీ కాచన రాజశేఖర్ రెడ్డి శుక్రవారం ఆవిష్కరించారు. ~పాడి రైతు సహకరించాలని కోరారు. సర్పంచ్ కాచన అరుణమ్మ, ఏహెచ్ఏ మహబూబ్ బేగ్ పాల్గొన్నారు.

సమర్థవంతంగా నిర్వహించండి

అవుకు: మండలంలో పశుగణనను పశువైద్య సిబ్బంది సమర్థవంతంగా నిర్వహించాలని ఎంపీపీ చల్లా రాజశేఖర్ రెడ్డి సూచించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ వెంగన్నతో కలిసి పోస్టర్లను విడుదల చేశారు. పశుగణన చేయడం వల్ల కలిగే ప్రయోజనాలను పాడి రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. పశువైద్యురాలు భారతీదేవి, వైస్ ఎంపీపీ రామప్ప పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

డోన్ టౌన్: పట్టణంలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా సుందర్‌సింగ్‌కాలనీ, టీచర్స్‌కాలనీ, నెహ్రూనగర్, తారకరామనగర్‌లలో శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ నాగేశ్వరరెడ్డి తెలిపారు. ప్రజలు సహకరించాలని కోరారు.

నేడు యనకండ్లలో గ్రామ సభ

బనగానపల్లె రూరల్: మండలంలోని యనకండ్ల గ్రామంలో శనివారం గ్రామసభ నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ నారాయణరెడ్డి శుక్రవారం తెలిపారు. గతంలో రీసర్వేలో వచ్చిన భూ సమస్యల పరిష్కారానికి సంబంధించి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు.

రాంప్రసాద్‌కు డాక్టరేట్



డోన్: పట్టణంలోని నెహ్రూనగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు రాంప్రసాద్‌కు శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం శుక్రవారం డాక్టరేట్ ప్రదానం చేయడానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈయన ప్రొఫెసర్ జయశంకర్ పర్యవేక్షణలో 'విజిబుల్ అండ్ నియర్ ఇన్ఫ్రారెడ్ ల్యూమినిసెన్స్ స్టడీస్ ఆఫ్ లాంథనైడ్ డోప్డ్ బేరియం పాస్ఫేట్ గ్లాసెస్ ఫర్ ఆప్టికల్ డివైస్ అప్లికేషన్స్'' అనే అంశంపై పరిశోధన పత్రాలు సమర్పించారు.హెచ్‌ఎం తొగట సురేష్‌బాబు, తోటి ఉపాధ్యాయులు వెంకటేశ్వరగౌడ్, శారదాదేవి, శివశంకరయ్య,రామకృష్ణారెడ్డి, మౌలాలి అభినందిచారు.

- సేవా తత్పరుడు.. డాక్టర్ రామిరెడ్డి
- రామిరెడ్డి సేవా సమితి ద్వారా సేవా కార్యక్రమాలు

వైద్యం వృత్తి.. సేవ ప్రవృత్తి



పేద యువతుల వివాహానికి ఆర్థికసాయం అందిస్తున్న డాక్టర్ రామిరెడ్డి

కోవెలకుంట్ల: ఆయనో డాక్టర్. పేదలకు సేవ చేయాలన్న ఉద్దేశంతో వైద్య వృత్తిలోకి వచ్చారు. ప్రజలకు ఇంకా ఏదైనా చేయాలన్న తలంపుతో సేవాసమితిని నెలకొల్పి పేదలు,దివ్యాంగులు, అనాథలకు చేయూతనిచ్చి వారిని అన్ని విధాలా ఆదుకుంటున్నారు. ఆయనే రెండు రూపాల డాక్టర్‌గా పేరుగాంచిన డాక్టర్ రామిరెడ్డి.సంజామల మండలం కమలపురికి చెందిన రామిరెడ్డి కర్నూలులో ఎంబీబీఎస్ పూర్తి చేసి 1974లో కోవెలకుంట్లలో స్థిరపడ్డారు. బస్టాండ్ సమీపంలో వైద్యశాలను నడుపుతున్నారు. పదేళ్ల క్రితం రామిరెడ్డి సేవా సమితిని ఏర్పాటు చేసి సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్నారు. ఒకవైపు వైద్యసేవలందిస్తూనే పేద యువతుల వివాహానికి, కుటుంబ పోషణ భారంగా మారిన అనాథలు, నిరుపేద కుటుంబాలకు ఆర్థికసా యం అందిస్తూ సేవాభావాన్ని ప్రవృత్తిగా ఎంచుకున్నారు.

రూ.30 లక్షలతో పార్కు ఏర్పాటు

పట్టణ శివారులోని కుందూనదిపై బ్రిటీష్‌కాలంలో నిర్మించిన వంతెన 2022లో శిథిలావస్థకు చేరుకోవడంతో మరమ్మతులు చేపట్టి వంతెన ప్రాంతంలో రూ. 30 లక్షల సొంత నిధులతో పార్కు ఏర్పాటు చేశారు. పిల్లలు ఆడుకునేందుకు జారుడుబండ, ఉయ్యాల, పెద్దలకు వ్యాయామ పరికరాలు ఏర్పాటు చేసి పచ్చదనంతో ఆహ్లాదకర వాతావరణం నెలకొల్పారు.

డాక్టర్ రామిరెడ్డి చేసిన సేవా కార్యక్రమాలు

- కోవెలకుంట్ల పరిసర ప్రాంతాలకు చెందిన 100 మంది అనాథలకు జీవనోపాధి కోసం రూ. 5 లక్షల ఆర్థిక సాయం అందించారు.
- సుమారు 100 మంది దివ్యాంగులకు రూ.5 లక్షలు అందజేసి ఔదార్యం చాటారు.
- పేద కుటుంబాల్లోని సుమారు 200 మంది ఆడపిల్లల వివాహాలకు రూ. 10 లక్షలు ఆర్థికసాయం అందించారు.
- కళాకారులు, కౌవులను ప్రోత్సహించేందుకు రూ. 2 లక్షల వరకు అందించి కళలపై తనకున్న అభిమానం చాటుకున్నారు.
- పట్టణంలోని పాండురంగ స్వామి దేవాలయ అభివృద్ధికి రూ. 50వేలు, పంచముఖ సిద్ధేశ్వరస్వామి ఆలయానికి రూ.20వేలు,కమలపురి చెన్నకేశవస్వామి ఆలయ అభివృద్ధికి రూ. 25వేలు విరాళాలు అందజేశారు.

ఓపిక ఉన్నంత వరకు సేవా కార్యక్రమాలు

వైద్యం కోసం ఆస్పత్రికి వచ్చే రోగుల కష్టాలను స్వయంగా చూశాను. పేద కుటుంబాలకు చెందిన రోగులకు ఉచితంగా వైద్యసేవలందించడమే కాకుండా వారిని ఏదో విధంగా ఆదుకోవాలన్న సంకల్పంతో పదేళ్ల క్రితం రామిరెడ్డి సేవా ట్రస్టు ఏర్పాటు చేశాను. కుమార్తెలు ఇద్దరు డాక్టర్లుగా అమెరికాలో స్థిరపడడంతో వారి కోసం సంపాదించాల్సిన అవసరం లేకుండా పోయింది. వైద్యం ద్వారా వచ్చే సంపాదనలో 40 శాతాన్ని సేవా కార్యక్రమాలకు వెచ్చిస్తున్నాను. ఈ నెల 26న డాక్టర్ వృత్తి చేపట్టి 50 ఏళ్ల పూర్తికానుండడం ఎంతో సంతోషంగా ఉంది. ఓపిక ఉన్నంత వరకు వైద్యసేవలు, సేవాకార్యక్రమాలు కొనసాగించమే లక్ష్యం.

–డాక్టర్ రామిరెడ్డి, సేవాసంస్థ అధ్యక్షుడు, కోవెలకుంట్ల

చోరీకి విఫలయత్నం



షట్టర్ తాళం పగులగొట్టడానికి యత్నిస్తున్న దుండగుడి సీసీ ఫుటేజీ దృశ్యం

డోన్ టౌన్: పట్టణంలోని పాత బస్టాండ్‌లో ఉన్న పలు దుకాణాల్లో గుర్తు తెలియని వ్యక్తి గురువారం రాత్రి చోరీకి విఫలయత్నం చేసిన దృశ్యాలు సీసీ ఫుటేజీల్లో రికార్డు అయ్యాయి. నెల క్రితం పాత బస్టాండ్‌లోని మంజునాథ మెడికల్ స్టోర్, రాజా టాకీస్ సమీపంలోని మరో రెండు మెడికల్ స్టోర్లలో చోరీ జరిగిన విషయం తెలిసిందే. ఈ ఘటన మరువక ముందే మళ్లీ అదే మంజునాథ్ మెడికల్ స్టోర్, కలకత్తా స్వీట్స్ షాప్ పక్కన ఉన్న కూల్ డ్రింక్ షాప్, కాశీం టీస్టాల్ తదితర దుకాణాల షట్టర్లు గుర్తు తెలియని నిందితుడు పగులగొట్టడానికి ప్రయత్నం చేశాడు. తాళాలు రాకపోవడంతో వెనుదిరిగినట్లు అక్కడ ఉన్న సీసీ ఫుటేజీల్లో రికార్డు అయ్యింది. పోలీసులు విచారణ చేస్తున్నారు.